క్లుప్తంగా

యాచకుడికి తాత్కాలిక షెడ్డు



బ్లాంకెట్‌లు అందిస్తున్న లింగమూర్తి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేట శివారులో బంగారమ్మ గుడి వద్ద యాచకుడికి లయన్స్ సభ్యులు తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేయించారు. బంగారమ్మ గుడివద్ద ఆరు బయట ఉంటూ ఇబ్బంది పడుతున్న యాచకుడి స్థితికి చలించిన లయన్స్ డిస్ట్రిక్ చైర్మన్ లింగమూర్తి తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేసి బ్లాంకెట్‌లను అందించారు. యాచకుడికి నెల రోజుల భోజనం కోసం స్థానిక హోటల్ నిర్వాహకుడికి డబ్బులను చెల్లించారు.

రెవెన్యూ డివిజన్ ప్రకటించే వరకు విశ్రమించం



దీక్షలో అఖిలపక్ష నేతలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ ప్రకటించే వరకు విశ్రమించమని, ఆందోళన తీవ్రతరం చేస్తామని అఖిలపక్షం నేతలు తెలిపారు. రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు శనివారం నాటికి 111 రోజులకు చేరుకున్నాయి. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాలను కలుపుతూ డివిజన్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

చేగుంట(తూప్రాన్): మహిళా సంఘాల సభ్యులు సకాలంలో రుణాలను చెల్లించి తిరిగి కొత్త రుణాలను తీసుకోవాలని ఏపీ జీవీబీ బ్యాంకు మేనేజర్ సురేశ్ అన్నారు. చేగుంట బ్యాంకులో ఐకేపీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, ఆయా గ్రామాల్లో మహిళా సంఘాలు చెల్లించాల్సిన రుణాలను వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, వీఓఏలు సరిత, హారిక, జ్యోతి, కవిత, రాజేశ్వరీ, సుజాత పాల్గొన్నారు.

మహంకాళికి బంగారు కిరీటం

రామాయంపేట(మెదక్): రామాయంపేట మహంకాళి అమ్మవారికి భక్తుడు సరాఫ్ రవీందర్ బంగారు కిరీటం బహూకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శాంతి కల్యాణం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నూతన డైరెక్టర్లుగా నియమితులైన కొత్త శ్రీనివాస్, రాములు, రాజు, దత్తు, ఆంజనేయులు, నాగమణి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

భూ కేటాయింపు సరికాదు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని అవుసులపల్లిలో దళిత కుటుంబానికి చెందిన రాపోలు సిద్ధిరాములు భూమిని ఫార్మసిస్టు వ్యాపారులకు కేటాయించడం సరికాదని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోవర్దన్ అన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి అవుసులపల్లి గ్రామంలోని ఆ కుటుంబాన్ని పరామర్శించి భూమి కేటాయింపు పై నిజమైన వివరాలను తెలుసుకున్నారు. అవసరమైతే ఈ వ్యవహారంపై దీర్ఘకాలిక పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్న శంకరంపేట వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ: ఆగస్టు నెలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ లింగంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఐబీలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ ముఖ్య నాయకుల ముందస్తు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాసాయిపేట యాదగిరి మాదిగ, మురళి మాదిగ, బాల్‌రాజ్ మాదిగ, యాదగిరి మాదిగ, పరశురాములు, రవి, సుధాకర్, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్, సంజీవులు, సత్యం, కోటయ్య, సుందర్, కుమార్, మహేందర్, కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలే..

- అధ్వానంగా ఖేడ్ – రాయిపల్లి రోడ్డు
- కలగానే మర్పల్లి బ్రిడ్జి
- తప్పని ఇబ్బందులు

రేగోడ్(మెదక్): ప్రభుత్వం గ్రామాలను ఆదర్శంగా మార్చడమే లక్ష్యంగా ముందుకెళ్తుంది. కానీ అది అన్ని గ్రామాల్లో అమలు కావడం లేదు. కొన్ని గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులకు విన్నవించినా.. ప్రయోజనం లేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు.

ఆదమరిస్తే అంతే..

రేగోడ్ మండల పరిధిలోని పోచారం నుంచి రాయిపల్లి వరకు తారురోడ్డు అధ్వానంగా మారింది.

- ఖేడ్ రాయిపల్లి రోడ్డు పోచారం నుంచి రాయిపల్లి వరకు అడుగడుగునా గుంతలే ఉన్నాయి. ఈ రోడ్డు గుండా రోజు వందలాది వాహనాలతో పాటు వేలాది మంది ప్రయాణికులు వెళ్తుంటారు. అడుగుకో గుంత ఉండటంతో వారు ఎన్నో అవస్థలు పడుతున్నారు.
- కనీసం మరమ్మతులు సైతం చేయించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోచారం వద్ద పడిన గుంతలు

- అదేవిధంగా రేగోడ్ నుంచి పోచారం దారిలో మర్పల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలో సుమారు రూ.1 కోటి నిధులు మంజూరు చేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా.. బ్రిడ్జి నిర్మాణం అలాగే మిగిలిపోయింది. పోచారం నుంచి రాయిపల్లి, ఖేడ్ రాయిపల్లి రోడ్డు పోచారం నుంచి రాయిపల్లి వరకు అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలి.



టి.లింగంపల్లి సమీపంలో రోడ్డుపై పడిన గుంతలు

అవస్థలు పడుతున్నాం



రోడ్డుపై గుంతలుండటంతో ప్రయాణించలేక అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.
– భాస్వరాజ్, ఆర్.ఇటిక్యాల

మరమ్మతులు చేపట్టాలి



ఖేడ్ – రాయిపల్లి రోడ్డుపై గుంతలు పడ్డాయి. పోచారం నుంచి రాయిపల్లి వరకు రోడ్డు గుంతలమయం అయింది. దగ్గరికి వెళ్లే వరకు గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లకు మరమ్మతులు చేయాలి. – సునీల్ కుమార్, సర్పంచ్ పోచారం

శనీశ్వరుడికి అదనపు కలెక్టర్ పూజలు



శనీశ్వరుడిని దర్శించుకుంటున్న అదనపు కలెక్టర్ రమేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న శనీశ్వరాలయంలో శని త్రయోదశి సందర్భంగా అభిషేకాలు, తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అదనపు కలెక్టర్ రమేశ్, సర్వేయర్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రవిప్రసాద్ శర్మ, ఉమాశంకర్ శర్మ, మురళీశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు శనివారం ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ అయినా సామగ్రిని హాస్టల్ వార్డెన్ శివరాం అందజేశారు.

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం స్టేషన్ మాసాయిపేట ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం పూర్వ విద్యార్థులు, స్వశక్తి యూత్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు కావాల్సిన నోట్‌బుక్స్, పెన్సిల్, పలకలను వారు అందజేశారు. విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు నగేశ్, శ్రీకాంత్, మధుబాబు, లక్ష్మణ్, రమేశ్ ఉన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

వైభవంగా బోనాల ఊరేగింపు



తూప్రాన్: బోనాల సంబరాల్లో విద్యార్థులు



రామాయంపేటలో..

తూప్రాన్: పట్టణంలోని గీతా స్కూల్‌లో ఆషాఢ మాస బోనాల వేడుకలను శనివారం విద్యార్థులు వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు బోనాలను తలపై పెట్టుకొని పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా బయలుదేరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ సీ.హెచ్.వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని మంజీరా విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు బోనాలను ఊరేగించి ఆటా పాటలతో నృత్యం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోనాల విశిష్టత గురించి వివరించారు. విద్యార్థులు పోతరాజుల వేషాధరణతో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వాసవి, మౌనిక, సుధాకర్, మీన, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న నేతలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో ఉన్న కస్తూర్బా గిరిజన బాలికల వసతిగృహం సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తిరుపతి రాథోడ్ అన్నారు. శనివారం వసతిగృహన్ని విద్యార్థుల తల్లిదండ్రులతో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతిగృహంలో సమస్యలు తిష్టవేశాయని వాపోయారు. ప్రహరీ ఓ పైపు కూలిపోవడంతో పశువుల సంచారంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నీటి సమస్య ఉన్నప్పటికీ పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలం అయ్యారన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, శ్రీనివాస్, తారాసింగ్, ఆనంద్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ డీఏఓగా ఆనంద్‌బాబు



ఆనంద్‌బాబు, డీఏఓ, నర్సాపూర్

నర్సాపూర్: నర్సాపూర్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డీఏఓగా పని చేసిన జేసీబాయి బదిలీ అయ్యారు. ఆమె పెద్ద శంకరంపేటకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో తూప్రాన్ ఆర్‌డీఓ ఆఫీసులో డీఏఓగా పని చేసిన ఆనంద్‌బాబు ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

◆ **బీఎల్ఓల సమావేశం**

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్ఓలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఫామ్ 6, 7, 8 లపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నాగవర్దన్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో ఓటర్ల వివరాలు విడివిడిగా సేకరించి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్‌లు జయభారత్‌రెడ్డి, ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్ద పిల్లలను చదివించాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

చేగుంట(తూప్రాన్): ఇంటి వద్ద పిల్లలతో పుస్తకాలను చదివించాలని కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలతో పాఠ్యపుస్తకాలు చదివించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కృష్ణ, ఉపాధ్యాయులు కవిత, శివకుమార్, నాయకులు కుమ్మరి నర్సింలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): రామాయపల్లిలో..

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థి ఎదుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్‌ఎం రాణి అన్నారు. శనివారం మండలంలోని రామాయపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్ రతన్‌లాల్‌తో కలిసి పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రోజు వచ్చేలా చూడాలని, ఇంటి వద్ద తల్లిదండ్రులు హోంవర్క్ చేసేలా చూడాలన్నారు. అప్పుడే విద్యార్థి భవిష్యత్‌కు బాటలు వేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపేందర్, సుకన్య, వీవీ మానస విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘ఉచిత కరెంట్‌పై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం’

నర్సాపూర్: రాష్ట్రంలో ఉచిత కరెంట్‌పై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. మాట్లాడారు. వైఎస్సార్ రుణమాఫీ పథకాన్ని సైతం పకడ్బందీగా అమలు చేశారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నదని అన్నారు. రైతులకు 24గంటల కరెంటు ఇస్తున్నామని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని ఎక్కడ 24గంటలు రావడం లేదని ఆయన ఆరోపించారు. కరెంట్ కొనుగోలులో కమిషన్లను బీఆర్ఎస్ నాయకులు దండుకుంటున్నారని చెప్పారు. తమపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు గమనిస్తున్నారని, బీఆర్ఎస్‌కు ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తార న్నారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన



చేగుంటలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు



కొల్చారంలో..



రామాయంపేటలో..



నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె శనివారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ప్రవీణ్, మల్లేశం, రాములు, ఇందిరా, కుమార్, ఏసు, మెసయ్య పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు శంకర్ అన్నారు.

రామాయంపేట(మెదక్): సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో రామాయంపేట, నిజాంపేట మండలాల కార్మికులు ఎంపీపీ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు.

తూప్రాన్: పట్టణంలోని దుకాణాల వద్ద ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు.



శివ్వంపేటలో ..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల జిల్లా ఉపాధ్యక్షులు ఆసిఫ్ ఆధ్వర్యంలో వీధుల్లో తిరిగి పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మనోహరాబాద్‌లో ..

సంక్షిప్త వార్తలు

◆ **ఇంటి నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు ఇవ్వడానికి, పలు అభివృద్ధి పనులకు, సీజనల్ వ్యాధుల నివారణ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వామిగౌడ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

◆ **అంగన్‌వాడీల్లో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం**



నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో శనివారం అంగన్‌వాడీ రెండో సెంటర్‌లో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 7 నెలల గర్భిణులకు సీమంతాలతో పాటు ఐదు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరసేనారెడ్డి, ఉప సర్పంచ్ సంజీవులు, కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, విజయ, గర్భిణులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

◆ **బస్సు రాకపై హర్షం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తుల కోరిక మేరకు శనివారం గ్రామానికి బస్సు సర్వీస్ వేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కిడి నరేందర్‌రెడ్డి బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుడు ఉదయ్‌రంజన్‌గౌడ్, యువకుల కృషితో గ్రామానికి బస్సు సౌకర్యం కలిగిందన్నారు. డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ.. నిత్యం ఉదయం, సాయంత్రం గ్రామానికి బస్సును నడపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, లక్ష్మీనర్సింలుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరేశ్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నేచర్ ఐకాన్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయులను నియమించాలి**

నర్సాపూర్‌రూరల్: ఉపాధ్యాయులు లేక తమ పిల్లలు విద్యను కోల్పోతున్నారని, వెంటనే ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని కోరుతూ పెద్దచింత గ్రామస్తులు ఉపసర్పంచ్‌తో కలిసి శనివారం ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సుమారు 120 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. కానీ కేవలం పాఠశాలలో 5 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, దీంతో విద్యార్థులు విద్యను కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కడారి నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం మన ఊరు – మన బడిలో భాగంగా హైస్కూల్ ఎంపికైనప్పటికీ సబ్జెక్టులు చెప్పడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, తాజా, శేఖర్, ఆంజనేయులు, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి**



మనోహరాబాద్(తూప్రాన్): వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు, వైద్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ పురం నవనీత అన్నారు. శనివారం మనోహరాబాద్ పీహెచ్‌సీలో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి రెడ్డి, వైద్యులు జ్యోత్స్న, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ వస్తే రైతులకు రుణమాఫీ**

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎక కాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జెండావిష్కరణ చేశారు. అనంతరం పాలాట, లింగారెడ్డిపేట్ గ్రామాల్లో గజ్వేల్ నియోజకవర్గ ఆత్మగౌరవ యాత్రలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ వచ్చాక సామాన్యులకు అండగా ఉంటుందన్నారు. వీరి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు నర్సింహచారి, నర్సింహ, ప్రభాకర్‌గౌడ్, సంతోష్‌కుమార్, అశోక్ , యాదగిరి, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌గుప్తా, భగవాన్‌రెడ్డి , బూర గణేశ్, రంగాచారి, నాగరాజుగౌడ్, గానుగు వెంకట్, రమేశ్, సర్వేశ్‌గౌడ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం**

తూప్రాన్: పట్టణంలోని 6వ వార్డులో ఆవుసులోని కుంట వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడి వెంకటేశ్, నాయకులు సత్యనారాయణగౌడ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి**

వెల్దుర్తి(తూప్రాన్): కొత్తగా పట్టా పాస్ పుస్తకం కలిగిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మాసాయిపేట మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 18 వరకు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ అయిన 18 నుండి 59 ఏళ్ల వయసు గల రైతులు సంబంధిత బీమా దరఖాస్తు ఫారం, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో ఆగస్ట్ 4వ తేదీ లోపు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే రైతు బీమా చేయించుకున్న వారు ఆధార్ కార్డులో ఏమైనా మార్పులు చేయించుకున్నా, నామినీ చనిపోయినా, నామినీ పేరు మార్చుకోవాలనుకునేవారు వెంటనే తమ కార్యాలయంలో సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **బోర్‌మోటార్ ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులతో వేయించిన బోర్ మోటర్‌ను ఎంపీపీ మాసుల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో బోరు బావులను తవ్విస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివ, బండ మల్లయ్య, బాలపోచయ్య, యాదగిరి, స్వామి, ఎల్లయ్య నర్సింలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20కోట్లు**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణాభివృద్ధియే లక్ష్యంగా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తెలిపారు. శనివారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి రూ.20కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. నిధులు కేటాయించిన పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావులకు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.